ఆంధ్రరాష్ట్ర ప్రారంభవిద్య

ANDHRA RASTRA PRARAMBHA VIDYA

విద్యావిషయిక మాసపత్రిక

సంపుటము 41] [సంచిక 10

[illegible] 1953



సంపాదకులు :

శ్రీయుత మహావాది వేంకటరత్నముగారు బి.ఎ.

వ్యవస్థాపకులు :

శ్రీయుత ఈదర వెంకయ్యగారు.

విషయసూచిక

1. నిత్యసంకీర్తనము.
2. రాష్ట్రములో బాలసారస్వతం—శ్రీ శీలా వెంకటప్ప
3. సంక్రాంతి సంబరాలు-సపలినసీమ—శ్రీ బి. పి. రామచంద్రా రెడ్డి
4. సంపాదకునకు లేఖలు—
5. లోభగుణము—(పద్య)—శ్రీ ఓలేటి రామనాథశాస్త్రి
6. మాదిరిప్రశ్నపత్రము - 8 వ తరగతి - తెలుగు - శ్రీవేదాన్తము శ్రీనివాసాచార్యులు
7. ,, ,, లెక్కలు
8. ,, ,, గ్రూపు—శ్రీ కె. సిద్ధలింగపిళ్ళె
9. ,, ,, సైన్సు—శ్రీ ఎన్. శ్రీనివాసాచారి
10. చరిత్ర ప్రశ్నోత్తరములు—శ్రీ ఆర్. సుబ్రహ్మణ్యం
11. వివేకప్రశ్నలు—
12. పదపూరణము—శ్రీ సి. హెచ్. నారాయణరావు
13. డిశంబరునెల చిత్రప్రశ్నలకు సమాధానములు—
14. వింతపదములు - పొడుపు కథలు
15. అమరజీవి—సంపాదకుడు
16. సభలు - తీర్మానములు
17. మీ గోచార భావఫలాలు—పండిత, డి. యస్. యన్. శాస్త్రి

Regd. M.N. 3766

సం||ర చందా రు 1—0—0

ఆంధ్రరాష్ట్ర
ప్రారంభవిద్య

విద్యావిషయిక మాసపత్రిక

సంపుటము 41] ఏలూరు, జనవరి 15 [సంచిక 10



వివరణము :

మనదృష్టిని గప్పివేయునది **అజ్ఞానమే.** వివేకముచేతనే దానిని బోఁగొట్టుకొనవలెను. మనలను తప్పుమార్గమున కీడ్వకుండునదే వివేకము. వివేకమును మనము విజృంభింపఁ జేయఁగలము. మనస్సే బంధమోక్షములకుఁ గారణము. కావలెనని అజ్ఞానమును దొలంగించుకొని దివ్యపథమున నడువఁగలము. లేకున్న నంధకార కూపమునఁ బడియుండఁ గలము. సర్వము మనచేతిలోనే యున్నది. వివేకమే మనకు భగవంతునిఁ జూపఁగలదు.

సంకీర్తనము :

హే అనంతమూర్తీ! నిన్ను సమీపించెడి మార్గమును నాకుఁ జూపుము.

నేను సదా నీకు విముఖుడనుగాక నీయందే దృష్టినుంచి నిన్నే స్మరించునట్లును గ్రహింపుము.

నీవే నా వాంఛితముల సమకూర్తువు గాక !

స్వామిరామతీర్థ

రాష్ట్రములో బాలసారస్వతం

రచన:—శీలా వెంకటప్ప టీచరు బోర్డు సెంట్రల్ స్కూలు కమలాపురం

స్వతంత్ర భారతములో నాటికంటె నేడు మన బిడ్డలకు ఉచితమైన వాతావరణములో, సర్వోత్కృష్టమైన పద్ధతుల ద్వారా విద్యగరపవలెనంటే ప్రత్యేకమైన బాలగ్రంథాలు అత్యవసరము. మన బాలబాలికలు వీటిద్వారానే సుశిక్షితులుగా, సుపౌరులుగా, తయారుకావడమే కాక తమ జీవయాత్రలో యేలాటి ఒడుదుడుకులు లేకుండా దరిచేరుకునేందుకు చక్కని అవకాశాలు యేర్పడుతాయి. మునుముందు విద్యాభిలాష కలగాలన్నా, జ్ఞానాభివృద్ధి కావాలన్నా, ఈ గ్రంథాలనే ఉత్తమమయిన సాధనాలుగా పరిగణించవలసి యున్నది.

గత దశాబ్దాంతరకు పిల్లలకు గాను ప్రత్యేకమైన పుస్తకాలు అంతగా వుండేవి కావు. ఇటీవల మాత్రం చందమామ, బాల, నవ్వులు పువ్వులు మున్నగు కథల సంచికలు బయలుదేరినా అనుకొన్నన్ని బయలుదేరకపోవడం శోచనీయం. శ్రీ చింతా దీక్షితులు, శ్రీ నాగంటి బాపినీడు, శ్రీమతి నాయని కృష్ణకుమారి మున్నగు సుప్రసిద్ధులు పిల్లలకు వ్రాసిన కొద్ది గ్రంథాలు తప్ప ఇతరులు అంతగా కృషిచేసి నట్టులేదు. బాలసాహిత్యాభివృద్ధికై వెలువడిన పత్రికలు మాత్రమే అవి అంతగా బాలబాలికల మనస్తత్వానికి అనుగుణ్యముగా లేవు. సరిగా బిడ్డల బుద్ధి వికాసానికి, భావనాపటిమకు, ప్రపంచజ్ఞానానికి యేమాత్రం దోహదం చేసేవిగా వుండడంలేదు. బాలలకు ఉత్తమమయినవి కూడ లభించడంలేదు.

అమెరికా, బ్రిటన్, రష్యా, మున్నగు పాశ్చాత్య దేశాల్లో ఆ ప్రభుత్వాలు బాలసారస్వతం విషయములో ప్రత్యేకశ్రద్ధ తీసుకొని కృషిచేస్తున్నవి. ఇటీవల అమెరికా ప్రభుత్వం కేర్ సంస్థద్వారా మద్రాస్ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ D. S. రెడ్డిగార్కి 300 బాలగ్రంథాల్ని సమర్పించి తమ సుహృద్భావాన్ని ప్రకటించుకొంది. మరిసోవియట్ రష్యా ప్రత్యేకంగా బాలసారస్వతప్రచురణాలయం నెలకొల్పి 1950 సం. లో 47,721,000 పిల్లల పుస్తకాలను ప్రచురించింది. 1951 సం. లో మరి కోట్ల కొలది బాల గ్రంథాలను ఆయా భాషల్లో ప్రచురించేందుకు నిర్ణయించుకొంది.

ఆ దేశాల్లో పాఠశాలలకు వెళ్లే చిన్నపిల్లల పుస్తకాల్లో కథలు, పాటలు, చిక్కుసమస్యలు, మున్నగు వివిధ విషయాలపై రచనలుంటాయి. మరియు ప్రజలపట్ల గౌరవం, మాతృభూమిపై అపారమైన ప్రేమాభిమానాలు, కష్టాలను ధైర్యసాహసాలతో ఎదుర్కొవడం, క్రమశిక్షణ, మున్నగు సుగుణాలు భావిపౌరులయ్యే బాలబాలికల హృదయాల్లో నెలకొనేటట్లు ఆకర్షణీయమైన చిత్రాలతో వారి రచనలు సాగిస్తూ పురోభివృద్ధి గాంచుతూ వున్నారు.

కాన మనరాష్ట్రప్రభుత్వంకూడ సుప్రసిద్ధులైన రచయితలను, పండితులను, ప్రోత్సహించి బాల సాహిత్యాన్ని విరివిగా సృష్టించేందుకు ప్రచారములోనికి తెచ్చేందుకు, ప్రయత్నించాలి. మనదేశం కూడ బాలబాలికల లేత మనస్సులను ఆకర్షింపగల కథలకు లోటులేదు. బాల మనస్తత్వాన్ని (Child Nature) బట్టి వ్రాసేందుకు, వ్రాసిన వాటిలో అత్యుత్తమమైనవాటికి పారితోషికాలు నిర్ణయించి ప్రోత్సహించాలి. అంతేగాకుండా చెన్నపురిలో బాలబాలికలకు నెలకొల్పబడిన గ్రంథాలయాల మాదిరి జిల్లా, తాలూకా కేంద్రాల్లోకూడ నెలకొల్పి క్రమక్రమంగా గ్రామగ్రామానికి కూడ ప్రాకేటట్లు చూడాలి. అప్పుడే మనబిడ్డలు నూతనచైతన్యముతో సుపౌరులుగా, సుశిక్షితులుగా తయారుకాగలరు. అప్పుడే సుస్థిర ప్రజాస్వామ్య వ్యవస్థకు దోహదకారులౌతారు.

* సంక్రాంతి సంబరాలు - సడలిన సీమ *

రచన :- బి. పి. రామచంద్రారెడ్డి (చదుం)

ఆనాడు సంక్రాంతి ప్రాప్తించిన పర్వదినం. కర్ణంగారి కుమారుడు కనకసుందరం కొలపురమని కరణి కుర్చీపై కూర్చున్నాడు. కర్మాగారాధకుడు పూజించుపగిది రంగయ్యపంతులు క్రింద కూలబడి, పాఠాన్ని బోధించుచున్నాడు. శిష్యుడు పైన... గురువు క్రింద... శిష్యునివద్ద గురువు గురుత్వము నేర్చుకొనవలసిన దుస్థితిపట్టింది... కొలముహిమ... కర్మఫలప్రభావం... ఇష్టమున్నను లేకున్నను, పొట్టకున్నను పస్తుండినను, ప్రయివేటుట్యూషను చెప్పవలసిందే. అది అతని అనివార్యమైన విధివ్రాత. స్వగ్రామ పాఠశాలనుండి సార్వభౌలకుండకమే కర్ణంగారిచ్చు ట్యూషను ఫీజు... ఆ గ్రామాధికారి గౌరవాలను గమనించుటకు గుర్తుగా కొడుకును కుర్చీలో కూర్చుండబెట్టి పాఠాలు చెప్పితీరాలి.

ఏడవతరగతి తెలుగువాచకములోని పెద్దపంతుగ నాటి ప్రకృతిశోభను పల్లెసీమల్లోని క్రొంగ్రొత్త కాంతులను వర్ణించుచున్నాడు. మధ్యమధ్యలో 'ఇప్పుడేమీ లేదే? ఇవెక్కడిరాతలు?' అని అడ్డు ప్రశ్నలు వేస్తూ యున్నాడు. తన కౌమరపు కళికల కనబరుస్తూ కనకసుందరం. గత గ్రామజీవితములోని సౌఖ్యసంపదల యున్నతస్థితిని స్మృతిపథంలోకి సంధానించుకొని, క్షణికమగు ఆత్మానందముతో పరవశత్వమొందాడు పంతులు. పాఠము పూర్తికాక మునుపే లేచి 'నిద్దరవస్తాంది' అని దరబాగా పల్కిపోతున్న కనకసుందరం కోలిబూట్ల టకటకా రావములు ముచ్చెలలో మోపినట్లు మ్రోగగనేమేల్కొన్నాడు రంగయ్య. విసాదపూరిత వర్తమాన వేదనలు ప్రత్యక్షమాతున్న కుటుంబాన్ని కలియజూచి తంపహృదయుడై నిట్టూర్పుల నిగుడించుచు లేచి నిల్చున్నాడు.

పంతుళ్ళ పదహారేళ్ళ ప్రథమపుత్రుడు పురుషోత్తం పగలెల్ల కూలికిపోయి కష్టించివచ్చిన కౌరణంగా వనుకుదీస్తూయుండి, దిగ్గునలేచి దీపం, దస్తరం యొత్తిపెట్టాడు. పద్నాలుగేళ్ళ పడుచు పద్మావతమ్మ గదినూడ్చి, పడక [illegible]. [illegible] ఆ యిల్లాలు ఒక [illegible] అక్కడింటను, [illegible] నుంచుకొని, నిద్రపోయింది. [illegible] మిగిలిన అంకణములో [illegible].

పంతులు పండుకొన్నాడే కాని [illegible] టలవరకు నిద్రపట్టలేదు, [illegible] తులు, వర్తమాన కాల వేదనల [illegible]... ఒకదాని తరువాత [illegible] మనోవీథిలో విహరించు చున్నాయి. సుందరానికి చెప్పిన [illegible] ప్రకృతిశోభల, పల్లెల్లోని ప్రశాంతతల [illegible]... వానికి వ్యతిరేకంగా [illegible] ప్రస్తుతపు ప్రకృతి ప్రభంజనము, పల్లెలపతనమునకై [illegible] పలుగా వెల్లడించుచున్నాయి.

నాల్గేళ్ళకు ముందు పల్లె పచ్చని [illegible] పొలముల మధ్య ప్రకాశించుతూ [illegible]. సంక్రాంతిమాసంలో ప్రకృతి పలువన్నెల [illegible] తీరులు ప్రజ్వరిల్లుచు, [illegible] భూతాల అందించేది. పల్లెచుట్టు [illegible] దోచున్నట్లు [illegible] మరకతో [illegible] ప్రాకారప్రకృతి సంపద పచ్చబడు [illegible] మిరపచెట్లాకుల... [illegible] మిరపపండ్లు... [illegible] వంగపిందెలు, గోమేధకమణిగచ్చును [illegible] బీరపూలు... బంగారుగుండ్ల [illegible] మాత్యాల మెరపించు [illegible] మగు మనోజ్ఞతతో [illegible]. [illegible] మళ్ళలో మిలమిలమనె [illegible] చున్నవి. [illegible] తట్టులో [illegible] కంచెలు కూలిపోతున్నాయి.

కళ్ళములలో [illegible] యెద్దుల బంతులు సరోవరములో [illegible] విహరించు హంసలజట్టును జ్ఞప్తికి [illegible] అట్టి నవధాన్యముల [illegible]

కొనింది. జిల్లేడు ఝూటలములు జూజురుకొన్నాయి. చిట్టికంపలచెట్లు చెడబెరిగినాయి. అవియైనా నానాటికి నుసియై పోతున్నాయి. మేరుపర్వతములాగు పెరిగిపోవుచుండిన కసవువాములున్నచోట పాముల పుట్టలు పెరిగిపోయాయి.

కనక శలాకలవంటి కణ్ణులు. పసిడిపండ్ల పోతిన కంకులుగల జొన్నచేలలో రంగురంగుల పక్షులు బారులుతీరి వాలుచుండగ, మంచెలపైనుండి వడిశెలరాళ్ళను వయ్యారముగ రువ్వుచు, కోయిల కంఠములో కేకవేయు పల్లెపడుచులు త్రిపురసుందరీ మణుల తిరస్కరించుచుండెడివారు - తమ త్రిగుణ తేజపు తళుకులతో నేడు వాడుక ప్రకారము పక్షుల గుంపులువచ్చి బంగారుపంటకు బదులు బీటలువారిన మంటిగడ్డలుచూచి, నిరాశతో మరలిపోవుచున్నాయి. ఆపొలాల్లో పటువుదప్పిన ముదుసలులు పిడుకలకొఱకు పారక పుల్లలకు ప్రాకులాడుచున్నారు.

ఒకనాటి సంధ్యావేళ తాను బడిపిల్లలను యేటియొడ్డున తెంకాయతోటకడకు విహారము తీసికొనిపోయి, అచ్చటి ప్రకృతికాంతనుగూర్చి వర్ణించిన విషయం జ్ఞాపకానికివచ్చింది. తోపుకావల సీతమ్మగుట్ట కనిపిస్తూయుంది. ఆగుట్టమీద కూకుటకు సిద్ధముగనున్న సూర్యుడు సీతమ్మ తీర్చిదిద్దుకొన్న తిలకమురీతి రంజిల్లుచున్నాడనియు, పదహారుకళలతో ప్రజ్వరిల్లు ఆకాశసంధ్యాకాంతులు ఆమె అలంకరించుకొన్న మేలుముసుగనియు, వయసులుతీరిన నిండు తెంకాయ వంబములు ఆ యమ్మ ధరించిన చిఱుగజ్జెలు వడ్డాణమనియు, సంధ్యవెలుగుల సంధించుకొని తళతళలాడు నిర్మల నదీజలము జానకమ్మ జోడించుకొన్న జరీచీరనియు, చెప్పుచుండగా పిల్లలు పరమానందమొందారు. కాని గతసాయంత్రం బహిర్భూమికిపోయి ఆదారినరాగా ఎండిపోయిన యేటియిసుక దిబ్బలను, సుళ్లురాలిపోయిన తెంకాయ మానులను చూచినాడు. తలలనునరికివేసి, నిలువునా శ్మశానంలో పాతిపెట్టిన మొండెములని భ్రాంతి జెంది భయంతో పారివచ్చాడు.

ప్రకృతిసంపద యట్లు పాడైపోయియుండగా పల్లెలలోని పరిస్థితులు మరీమగ్గిపోయినవి. సంక్రాంతి నాడు సాక్షాత్ స్వర్గసంబరాలతో సందడిగానుంటేది. నేడా సంబ్రమములు సడలిపోగా సంతాపములను సంపుటీకరించుకొన్నాయి.

పశువులమోముల పసుపు కుంకుమలుపూసి, కొమ్ములకు నీలిపూతలుపూసి, పసిడికుప్పెలుపెట్టి, పీతాంబరములు కప్పి, వెండిమువ్వలుకట్టి, పలువర్ణముల ప్రభలు కట్టుచుండెడివారు. పప్పుదోసెలు, గుమ్మడిపప్పులు.మత్తుచెక్కలు, మజామూపెడివారు. అదని అదురునట్లు కుప్పిగంతులువేయుచు, కొండలనైనా చీల్చుకొనిపోయే కుఱ్ఱలను పట్టుకొన పఱువిడే యువకుల యుత్సాహ మెంతో వినోదంగానుండేది వీక్షించడానికి.

నేటికి పశుసంపదే సన్నగిలి పోయింది. మేతలేక మరణించినవి. నీళ్ళులేక నీల్గక పోయినవి పోగా ఈదరగాలి కెన్నోరాలిపోయాయి - కొన్నింటిని సంతలకుతోలి తిండిగింజల కమ్ముకొనగా మిగిలిన వానిని కొందరు నిలువునా ప్రాణాలుతీసి ఆకలిచిచ్చును ఆర్పుకొన్నారు. అప్పటికి చుట్టుప్రక్కలు పశువుల అస్థిపంజరములతో నిండిపొయ్యాయి. నాలుగైదు చూడియావులు మాత్రము చూచేదిక్కులేక తూలుతున్నాయి తలలువాల్చి.

ఒకటిరెండు యిండ్లలో మాత్రము ముసలివాండ్ర మూల్గులు వినబడుతున్నాయి. మిగిలిన వన్నీ గబ్బిలాలకు, గండ్రచీమలకు, మండ్రగబ్బలకు. మందిరాలయ్యాయి. తాత్కాలికంగా మొండి గోడలు మాత్రము యిండ్లకు సరిహద్దులు చూపుచున్నాయి. కొన్ని వీధులవైఖరిగాని, ద్వారముల దారిగాని, అగోచరంగా నున్నాయి. ఒకప్పుడా వీధుల కిరుప్రక్కల పసుపుకుంకుమ అలదిన ద్వారబంధములు, జేగురులు జీరాడు అరుగులు, ముచ్చటగొల్పే ముగ్గుల ముంగిళ్ళు,మహదానందమందిచ్చేవి...అముగ్గులమధ్య గొబ్బిళ్ళు గులకరించేవి...గొబ్బిళ్ళచుట్టు చిట్టిపాపలు గునగున తిరుగుచు, బుడిబుడి పాటలు పాడుచుండ చూడగ కనుల పండువగొల్పేది... వేకువ జామున భక్తావళి మాఘస్నానముచేసి హరిభజనసంకీర్తనలు వీధులవెంబడి పాడుచుండుట వీనులవిందుగొల్పేది. నేడు కుక్కలసంచారము, నక్కలకేకలు, తప్ప మరేమియు కనవినరేము.

పై పల్లెసీమ పతనానికి కారణమేమని ప్రశ్నించుకొన్నాడు పంతులు. కరువుకర్కశము, కలిమిపరుల క్రౌర్యము, పరిపాలకుల ప్రమత్తతయే ప్రముఖ కారణములని హృదయవాణి గొణిగింది.

నాలుగేళ్ళనుండి వర్షం విగతమయింది. చేరునకైనా పైరులేవు, కేవలము కృషితోనే జీవించుచుండిన రైతుల జీవనాధారము జారిపోయింది. నగానట్రా కరిగించి త్రాగినా, పశువుల పరపులకు తోలినా,

మడక, మాను అమ్మితినినా, ఆకలిబాధ తీరింది కాదు. భూములు, భార్యపుస్తెలు, భుక్తికిచాలలేదు. కడకు కూలియైనా దొరుకుట దుర్లభముయింది.

కర్ణంగారు కరువుపని కల్పించాడు. ఎగువ చెఱువు మరమ్మత్తు, ఏటికాలువకట్టడము, బస్తీకి బాట, పనిపెట్టించాడు. కాని పొద్దుఅస్తమానము పెనుకులాడినా పావులాడబ్బు దొరికేవికావు. పైగా చేతులుబొబ్బలెత్తి చిట్లిపోయాయి ... అరికాళ్ళు అరిగిపోగా, వీపులు వంగిపోయాయి... ఒకటిన్నర పెల అహర్నిశలు అవస్థపడినా ఒంటిపూట గంజియే ఆగ్రామ జనావళికి...ఈకరువు పనుల నిర్వహణతో కర్ణంగారి సుద్దమిద్దె రెండంతస్తుల సిమెంటుమేడగా తీరింది, మూడవ అంతస్తులేని దానికి ప్రభుత్వపుకరువు బాకీలు వచ్చాయి. క్షామపీడిత రైతాంగమునకు బావులు త్రవ్వకొనుటకు, ఎద్దులు పట్టుకొనుటకు, తిండిగింజలు కొనుక్కొనుటకు, అప్పులివ్వడానికి ఆఫీసర్లురాగా కర్ణంగారు కలుసుకొని ఖర్మకాండానికిదిగినాడు. వారివీరి చేవ్రాలు సేకరించి, సైకొన్నంతాతన పొట్టనేపెట్టుకొన్నాడు. దానితో మూడంతస్తుల హర్మ్యాన్ని యెక్కగలిగాడు. వేరు జీవనోపాధిలేని ఆగ్రామ ప్రజకు వలసవెళ్ళుటేవిధి విధానమయింది.

ప్రయాణప్రయాసలు పడలేని ముసలివారిని వదలి భార్యాబిడ్డలతో డెల్టాభూముల వైపు వలసవెళ్ళి నారు. ఐదువందల బాలవృద్ధులకు గంజికేంద్రము, పాలకేంద్రము కర్ణంగారు లెక్కలలో జరుపుచు, వారానికి వందపన్నెండు రూపాయలు మిగుల్చుకొంటున్నాడు. వచ్చిన ఉద్యోగులుబైత్తు జేబులతో జారుకొంటున్నారు. కాని నిరాధారులై నిల్చియున్న యీముసలివాండ్రకస ముస్తైదు గంజియైనా పోసిన పుణ్యానపోలేదు.

ఒంటిగంటయింది. వర్తమాన వ్యధితలస్మృతికి వేసారి మగత నిద్రలో పడ్డాడు కాని కలవరింపులు కడలి కెరటాల కరణిక్రందుచున్నాయి...జరగలేని తన జీవనభారమునుగూర్చి ప్రవేదనాలాపములు పరంపరలుగా పుట్టుకొస్తున్నాయి. పుత్రుడు పురుషోత్తం వళ్ళుయెరుగని నిద్రనుండి మేల్కొని వింటున్నాడు.

ఉదరపోషణార్థమై ఊరివారంతా వలసవెళ్ళిపోగా పిల్లలు లేకపాఠశాల పాడుపడినట్లయిందే! పరీక్షింప వచ్చిన పెద్ద అధికారులు పిల్లలహాజరునకై పంతులు ప్రచారము చేయాలి ఆకర్షించే ప్రయత్నచేయాలి' అని రిమార్కులు రగిలించి పోయారే! వారానికొక వార్నింగు పంపడమేగాని గుచ్చటి పరిస్థితులు పరికించు పనివారిదికాదట. పాఠశాలనుమూసి వేయుదురనేవదంతికూడ బయలుదేరింది. తరువాత మాగల్యం తరమేమిటో! ఇప్పటికే మూడునెళ్ళ జీతాలురాక మూడుపూటలకొక కూడయింది. ఉన్నఉద్యోగమూ ఊడిపోతే చతికిలబడిన యీ సంసారాన్ని సాగించడమేలాగో! కొడుకు కర్ణంగారి మేడమీద పని చేయడమేగాని వట్టి కడుపుతో వెట్టిచాకిరీలాగుంది. ఏప్రాజెక్టువద్దకైనా పంపుదామనుకొంటే లేబ్రాయము ఏకైక పుత్రుడు...ఎనిమిదవతరగతియైనా పూర్తిచేయజాలని అమాయికుడు."

కలవరింపులలో తండ్రి కన్నీటిధార కనబడింది కొడుక్కు. తండ్రి కలతగుండెల దడదడ దుంపిల్లజేసింది పుత్రున్ని. ఆ కలవరింతలు పురుషోత్తముని నొక సాహసకృత్యానికి సుద్యుక్తపరచాయి. గుడ్డిదీపము ముందర కూర్చొని కన్నీటితో నొక కమ్మ వ్రాసి తండ్రి తలగడక్రింద పెట్టినాడు. మాతాపితలకు నమస్కరించి మబ్బులోకి ముందడుగువేశాడు.

తెల్లవారగనే పురుషోత్తం వ్రాసినలేఖను చూచి యిల్లాలి నిలువునా నీరైపోయారు. ఏకైక పుత్రుని పోగొట్టుకొన్నందుకా తల్లిదండ్రులు పడు వేదన వర్ణనాతీతం. ఎదిగిన చెల్లెలు యేడ్చుచూ చదివింది జాబును 'నాన్నా! వెళ్ళుచున్నాను. వ్యసన పడకండి ఏప్రాజెక్టు వద్దనైనాపని కుదుర్చుకొని పైకంపంపుతా. అధైర్య పడవద్దని అమ్మకు అమ్మాయిలకు, చెప్పండి పద్మావతమ్మకు పెండ్లి...ఇక వ్రాయలేను'

పదిగంటలైనా ప్రక్కనుండి లేవలేదు. పుత్రశోకంతో పాక్కిపోతున్నపంతులు. ఇంతలో పోస్టుజవానువచ్చి అఫీసుకాగితమిచ్చి పోయాడు. పిల్లల హాజరు తక్కువైనందున బడి మూసివేసి, కర్ణంగారి స్వాధీనం చేయాలని వచ్చింది ఆర్డరు ప్రచారముచేయలేని పంతులు పదవికి పనికిరారని కూడ తూలనాడినారు. గోరుచుట్టుపై గొడ్డలిపెట్టు పడినట్లయింది. పిల్లలు పొట్టలు పట్టుకొని పాలి కేకలు పెట్టుచున్నారు. ఏలాగైనా వారి ఆకలి తీర్చాలి తండ్రియైనందుకు, ఆఫీసు ఉత్తరవును తీసికొనిపోయి కర్ణంగారికి అందిచ్చాడు మేడపనిలో కూలియైన యిమ్మని మొఱపెట్టుకొన్నాడు. కొడుకు స్థానంలో నాల్గవ అంతస్తుపైకి యిటుకరాళ్లు మోస్తున్నాడు. యంత్రంలాగు బస్తీబడినుండి వచ్చిన కనకసుందరం గుమ్మపుబంటినుండి దిగుతూ పంతుల్నిచూచి

ః ః ః సంపాదకునకు లేఖలు ః ః ః

౧. లేఖ

గతసంవత్సరము E. S. L. C పబ్లికు పరీక్షలో చరిత్ర, భూగోళ ప్రశ్న పత్రమునందు రెండు హిందూదేశపటములను గీయవలసినదిగను, అందు కోరినవాటిని గుర్తించవలసినదిగను, ప్రశ్నించిరి. ప్రాథమికదశలోనున్న ప్రాథమికవిద్యార్థులు దేశపటములను స్వయముగా గీయలేరనుట నిర్వివాదాంశము. ప్రస్తుతము S. S. L. C. విద్యార్థులకుగూడ ప్రశ్న పత్రములో 'Out line map' యిచ్చి, పట్టణము గుర్తించవలసినదిగా ప్రశ్నించుచు, ప్రాథమిక విద్యార్థులను ఇట్లు ప్రశ్నించుట కడుంగడు శోచనీయము కాదా ? పైగా రెండుమ్యాపులనుగీచి, విషయములను గుర్తించుట వారికి మిక్కిలి దుర్లభము.

కనుక 1953 E. S. L. C. పబ్లికు పరీక్షనుంచియైన తమలోగడ విధానమును మార్చుకొని, చరిత్ర, భూగోళ ప్రశ్న పత్రమునందు, విద్యార్థుల మానసిక వికాసమునను సరించి, మాదిరి దేశపటములను ఇచ్చుచు, విషయములను గుర్తించుమని ప్రశ్నించవలసినదిగా విద్యాశాఖాధికార్లను, ఆంధ్ర యూనివర్శిటీ పరీక్షాధికార్లను ఈలేఖద్వారా మిక్కిలి ప్రార్థించుచున్నాను.

పోలుకొండ }
1-1-1953 }

కూచిభొట్ల పరశురామశాస్త్రి,
హెడ్మాష్టరు - బోర్డుహైయర్ ఎలిమెంటరీస్కూలు.

౨. విద్యాశాఖోన్నతోద్యోగి గారికి

ఆర్యా!

సవినయ నమస్కృతులు. శ్రీ ప్రభుత్వమువారు మనదేశమునందు విద్యాభివృద్ధినిగోరి, వ్యయ ప్రయాసలకు గురియగుచున్నారు. అందులో నొకటి 8 వ తరగతి పబ్లికు పరీక్షలు.

ఈ పరీక్షలకు వేలాది విద్యార్థులు హాజరగుచున్నారు. కాని ప్రత్యేకముగా దరఖాస్తు ఫారాలను గూర్చి పెట్టుటెందట ఎంత శ్రమపడుచున్నారో దైవమున కెఱుక. ఫారం ఒకటింటికి 3 రూ॥ వరకు ఖర్చు (లంచము) చేయవలసివస్తుంది. ఈ పిశాచి విద్యార్థులను పీడించుచు, 'పురటిలోనే సంధి మూంచివేసి' నట్లు కొందరి విద్యార్థుల విద్యాకాంక్షనే రూపుమాపుచున్నది. విద్యార్థులకు నేరుగా యీ పై ఫారాలు సప్లయిచేయకపోవుటవలన విద్యార్థులిట్టి కష్టములకు గురియైనారు. దక్షిణ హిందూస్తానీ ప్రచారసభవారికి వలెనే ఫారం 1కి కొంతపైకం నిర్ణయించి, కోరినవారికందరికి సప్లయిచేసినట్లయితే "దెబ్బకురెండు" అన్నట్లు, విద్యాశాఖోద్యోగుల అనవసర అధికారాలున్నూ, పనిగొడవయున్నూ, కొంత తగ్గుతవి. కాన అధికారులద్వారాగాకుండా నేరుగా విద్యార్థులకు సప్లయిచేయవలసినదిగా గోరుచున్నాను.

లేదా! ప్రతి తెలుగు Text book లోని మొదటి లేక ఆఖరు పేజీగాని ఆధారంగా నిర్ణయించేస్తే (వాగ్గ్రపీబుక్కులోని మ్యాపుకాగితము రీతిగా) ఎట్టి చికాకులూ యుండవు. కాన శ్రీ ప్రభుత్వము వారు యోచించి, తగు ఏర్పాటునుజేసి, విద్యార్థుల వ్యయప్రయాసముల తగ్గించెదరని నమ్ముచున్నాను.

గడవానిపేట }
9-12-52 }

బూరాడ గోపాలం,
టీచరు.

---

౨౨౫ వ పేజీ తరువాయి

పంతులయ్య పనికివచ్చారే అని వికటాట్టహాసం చేసాడు. కుమారుని వియోగాగ్ని గుండంలో దుర్భాగ్యముతో రగిలిపోతున్న రంగయ్యను పరిహాస పరాభవ ప్రభంజనుడు తాకి తలక్రిందులచేశాడు. రాళ్ళ తట్టతో సహా క్రిందికి దొర్లుకున్నాడు. లేక బ్రతుకుతో బాధపడుటకంటె, లోకమునే వీడుట ఉత్తమమని, పడినచోటనే పరలోకగతుడయ్యాడు.

పుత్రుని శోకంతో శోషిపోయిన పంతులు సతికి భర్తమరణవార్త వినబడగానే గుండెనిలిచి పల్లుక పోయింది. నింగినేలల ఆధారములేక పరుగులిడు పక్షిపిల్లలపగిది మాతాపితృ విహీనులైన ఆ ఆడబిడ్డలు అమ్మయ్యట్లు అట్టాడుచు ఆలమటించుచున్నారు. ఆ అబలలకు ఆశ్రయమేది ? అనాదరులై అత్యాకలితో ఆక్రందించుచుంటే వారి విధివ్రాత ?

లోభగుణము

(పద్యనీతికథ)

దైవజ్ఞభూషణ : కవిచంద్ర,
ఓలేటి రామనాథశాస్త్రి,
మేనేజరు : బహుజనవిద్యాపాఠశాల,
పురిటిపెంట.



ఆ. ఒక అరణ్యమందు నొక వేటకాఁడొక
అడవిపందిఁ జూచి విడువ శరము
ఆ వరాహ మవనియందున గూలె-నా
గ కొమ్మకండు వేటకానిఁ బొడిచె...౧

ఆ. పుట్టచెంత నున్న భుజగమ్ము మీదకు
కత్తి విసరి వేటకాఁడు దాని
హతమొనర్చెనాతఁడా పామువిషము మే
నెల్లఁ బ్రాకఁ బ్రాణ మిట్టె విడిచె...౨

ఆ. చెరువున గలట్టి జిత్తులమారి యా
నక్కయొకటి దీనిఁ జక్కఁబెట్టెఁ
నాకు 'పంది' పది దినాలకు సరిపోవు
నెఱుకవాఁడు చాలు నేడునాళ్లు... 3

ఆ. పాము కడుపునిండ భక్షింప నొక నాటి
కద్దిర! సరిపోవు నని తలంచిఁ
బాణ మున్నకడకు పరుగెత్తుకొని పోయి
బాణమునకు కట్టబడినయట్టి... ౪

ఆ. నరముల దిలకించి నాకు నీపూటకు
దీని దినినఁ జాలుఁ గాన నిపుడు—
పాము బోయవాని, వననూకరంబును
ఖర్చు సేయరాదుగాఁ దలంచి... ౫

ఆ॥ లోభగుణము మనసులోఁగల్గ దాచుకో
దలఁచి ఆశవముల దాటి వచ్చి—
కోరి వింటనున్న నారిని కొఱుకగా
ఎక్కు పెట్టియున్న ఎక్కు కోల...౬

ఆ. తనదుమెడకుగ్రుచ్చుకొనిపోయి పేగులు
పైకి లాగివైచె ప్రాణ మంత
విడిచె జంబుకమ్ము - విశ్వములో నెల్ల
లోభి దేనికైన లాభిగాడు... ౭

(పద్యనీతికథావళి.)

మాదిరి ప్రశ్నపత్రము

8 వ తరగతి | తెలుఁగు | కాలము 2 గంటలు

I "తనుహృద్భాషల......దైత్యోత్తమా!" అనుపద్యమును పాదభంగము లేకుండా వ్రాసి తాత్పర్యమునుఁ జేర్చుము. 8

II "చదువది యెంత......భాస్కరా" అను పద్యమును వ్రాయుఁడు? 5

III (a) దుఃఖభాగులెవ్వరు? (b) సప్తవ్యసనములెవ్వి? 6

(b) 'మూషికము - ముని' పద్యకథలోని నీతులను వివరింపుఁడు. 4

IV (a) కాపురుషగుణంబులెవ్వి ? 4

(b) హరిభక్తిలేనివారి సంసారములు వేనితో పోల్చబడెను ? 5

V 'పిల్లలకు మాంసమందు రుచిమిక్కుటము' అని గ్రద్దయన పిల్లి పల్కినమాట లెవ్వి? 6

VI బ్రహ్మరాక్షసుని పూర్వజన్మకథను వివరింపుఁడు. 8

VII వీరమనేని రాజభక్తిని - పితృభక్తిని - వర్ణింపుఁడు? 8

VIII ఈక్రిందివాని సందర్భములను వివరింపుడు -

1. 'కులశీలములుదెలియక యెవరికిగాని తావిచ్చుట తగదు'
2. 'నోటికందిన యాహారము వదలుకొను మందుఁడుండునే'
3. 'నేడు నీదోషమును సహించినాము' 6

IX 1. సంధులనువిడదీయుండు:-(1) దానవేంద్ర (2) క్రొన్నిగ్గులు (3) పిఱువీకి (4) సంగాతకాడు (5) గొర్రెదాలు (6) క్రేఁచూపు (7) తేఁబ్రాయము (8) నివ్వెఱ. 4

2. వ్యుత్పత్తి అర్థములు:-(1) పార్శ్వము (2) మరాళము (3) సీమంతిని (4) అంబుధి. 4

3. వ్యతిరేకపదములు:-(1) వివేకము (2) కళంకము (3) అగోచరము (4) అలఘు (5) కృతజ్ఞుండు అపకృతి. 3

4. ఒక్కొక్కదానికి రెండర్థములు:-(1) బలము (2) ఘనుండు (3) నెమ్మి. 3

5. ప్రకృతివికృతులను వ్రాయుము:- (1) పద్యము (2) పుణ్యము (3) దోసము (4) కర్జము (5) గృహము (6) సైరణ 3

6. పర్యాయపదములు:-(1) గాలి (2) రాజు. 3

IX ఆంధ్రరాష్ట్ర ఆవశ్యకత-లేదా వార్తాపత్రికలు చదువుటవలన కలుగు లాభములనుగూర్చి ఒక పుట వ్యాసమును వ్రాయుండు. 20

వేదాన్తము శ్రీనివాసాచార్యులు,
హెడ్మాష్టరు, ఆత్కూరు - కృష్ణాజిల్లా.

మాదిరి ప్రశ్నపత్రము

8 వ తరగతి లెక్కలు కాలము 2 గంటలు

I (a) సూక్ష్మీకరింపుము : $\dfrac{\frac{1}{3}+\frac{1}{4}-\frac{1}{8}}{\frac{1}{3}+\frac{5}{8}-\frac{1}{2}}$ లో $2\frac{1}{5}$

(b) ఒకసైకిలు చక్రవ్యాసం 21 అంగుళములు. అదినిమిషమునకు 110 చుట్లు తిరిగిన దానివేగం గంట కెన్నిమైళ్లు?

II ఎ, బి, సి, లు క్రమంగా రూ 2700 లు, రూ 3900, రూ 1500 లు, పెట్టుబడితో వర్తకంచేయగా సంవత్సరాంతమునకు రూ 2,835 లు లాభమువచ్చిన యెవరికెంత లాభమువచ్చును?

III ఒకగ్రామ మాగాణి భూమిలో $\frac{4}{11}$ వంతు A కును, మిగిలినది B వాటా A వాని భాగంలో $\frac{1}{3}$ వంతు. B $\frac{2}{7}$ వంతు, Cకు అమ్మగా Cకు ఆ గ్రామంలో 90 ఎకరములు యేర్పడినచో గ్రామంలోని మాగాణి యెన్ని ఎకరములు?

IV 20 మంది ఒకపనిని 16 రోజులలో చేయగలరు. 9 రోజులతరువాత 6 గురు పనిమానినచో పని మానినచో పని యింకెన్ని దినములకు పూర్తియగును?

V త్రిభుజాకారపొలం భుజములు క్రమంగా 60 గ. 50 గ. 42 గ.లు. 20 గ.లు 1 అంగుళంస్కేలుతో పటంగీచి, కోణములను కొలచి, వైశాల్యం కనుగొనుము.

VI నేను నూటికి సంవత్సరమునకు రూ 6 ల వడ్డీరేటుతో రూ 250 లను 2 సంవత్సరములకాలం వడ్డీకి యిచ్చితిని. నాకు రాగలవడ్డీ అర్ధసంవత్సరంలో రావలెనన్న అసలెంత యుండవలెను?

VII ఒకగది చుట్టుకొలత 132 అడుగులు. దానిపొడవు వెడల్పులసంబంధము 7:4 అయిన ఆగది నేల గచ్చుకు చ గ॥ 1 కి 0-11-0 ల వంతున ఖర్చెంత?

VIII ఒకరైలుబండి మొదటి 55 మైళ్ళదూరం గంటకు 20 మైళ్ళవంతున, తరువాత 75 మైళ్లు గంటకు 25 మైళ్ళవంతున, నడిచెను. గంటకు రైలు సరాసరివేగమెంత?

వేదాన్తము శ్రీనివాసాచార్యులు,
హెడ్మాష్టరు - ఆత్కూరు - కృష్ణాజిల్లా.

మాదిరి ప్రశ్నపత్రము

చరిత్ర - భూగోళము - సివిక్సు

I. ఒకమాటలో జవాబులిమ్ము:— కాలము 2 గంటలు

(1) అంతర్జాతీయనది ఏది? (2) సముద్రములోనికి మొనతేలి పొడుచుకొని వచ్చిన భాగము. (3) సైబీరియా, టండ్రాలలో నివసించు ప్రజలెవరు? (4) అధికశీతోష్ణస్థితిని కలిగియుండి, వర్షశూన్యమగు ప్రదేశము (5) చైనాలో పడవలపట్టణమని దేనికిపేరు? (6) ప్రపంచమందలి పెద్దబొగ్గుగనిఏది? (7) స్థానిక స్వపరిపాలన చట్టము ప్రవేశపెట్టిన ప్రభువెవరు? (8) ఘూర్ఖాలతో యుద్ధము చేసినగవర్నరుజనరలుఎవరు? (9) ప్రథమమున తపాలాపద్ధతిని ప్రవేశపెట్టినవారెవరు? (10) మనకు ప్రజాప్రభుత్వ మెప్పుడు లభించెను? 5

౧. చరిత్ర.

II. మొగలాయి సామ్రాజ్య మెవరికాలమున ఔన్నత్య స్థితియందుండెను? అదిక్షీణించుటకుగల ముఖ్య కారణములను సూచింపుము. (7)

III. (1) మొదటి అఫ్గను యుద్ధమునకు కారణములేవి? (5)

(2) కడపటి మైసూరు యుద్ధముయొక్క ఫలితములేవి? (4)

IV. (1) సిపాయీల తిరుగుబాటు ఎవరికాలమున జరిగెను? దానికి గల కారణములేవి? (5)

(2) రాజారామమోహనరాయలు చేసిన సంస్కరణములేవి? (4)

V. ఈ క్రిందివానినిగూర్చి క్లుప్తముగా వ్రాయుము:—

(1) రయితువారీపద్ధతి (2) పిండారీలు (3) దత్తతస్వీకారభేదనచట్టము (4) శాశ్వతశిస్తువిధానము (5) రాజాతోడర్‌మల్ (6) రెగ్యులేటింగు చట్టము. (12)

౨. భూగోళము.

VI. ఈ క్రిందివానికి కారణములిమ్ము:—

(1) సైబీరియాలోని నదులు వ్యాపారానుకూలములుగావు (2) మాంచెస్టరునందు ప్రత్తిపరిశ్రమ విరివిగా జరుగుచున్నది. (3) పర్వతప్రాంతములును, సముద్రతీర ప్రాంతములును, వేసవి విడుదులు. (4) బంగాళములో జనులు దట్టముగా నివసించుచున్నారు. (5) ఆక్యాబు, నాగపూరు, ఒకే అక్షాంశరేఖ మీదనున్నను శీతోష్ణస్థితియందు ఎక్కువ భేదించును. (10)

VII. (1) మధ్య ఆసియా (చైనా)లో ప్రవహించు మూడు ముఖ్యనదులను పేర్కొని, అవి ఏమహాసముద్రములో కలియుచున్నవో తెల్పుము. (4)

(2) ఆనకట్ట అనగానేమి? హిందూదేశములోని మూడు ముఖ్యమగు ఆనకట్టలను పేర్కొని, వాటి ఉపయోగములను విశదపఱచుము. (4)

VIII. (a) ఈ క్రిందివి ఏమి? ఎచ్చట నున్నవి?

(1) పో (2) పిరనీసు (3) విక్టోరియా (4) ఫారా (5) జోహానెస్‌బర్గు (6) లీడ్సు (7) జిబ్రాల్టరు (8) ఫ్యూజియామా (9) రుహారు (10) పెనామా. (5)

(b) ఈ క్రింది వస్తువులు ప్రపంచములో నెచ్చట ఎక్కువగా దొరకును. (6)

(1) గోధుమ (2) కాఫీ (3) రబ్బరు (4) ఉన్ని (5) ఇనుము (6) నూనెగింజలు.

IX. (1) హిందూదేశములో జరుగు నాల్గు ముఖ్యపరిశ్రమలను పేర్కొని, అవి జరుగు ప్రదేశములను, వాని ప్రాముఖ్యతకుగల కారణములను వ్రాయుడు. (5)

(2) హిందూదేశములోని నాల్గు ముఖ్యరేవుపట్టణములను వ్రాసి, అందుండి ఎగుమతియగు రెండు ముఖ్యవస్తువులను వ్రాయుడు. (4)

3. సివిక్సు :

X. (a) ఓటు అనగానేమి ? దీనిని సద్వినియోగము చేయుటెట్లు ? (3)
 (b) పంచాయతీ యూనియన్ యొక్క ముఖ్యవిధులను వివరించుడు ? (5)
 (c) ఈ క్రిందివానికి నీవు చేయు ప్రథమ చికిత్సలేవి ?
 (1) ఒకనికి బట్టలంటుకొన్నప్పుడు (2) ఒకడు మూర్ఛపోయినప్పుడు. (4)

XI. విరామకాలమును సద్వినియోగపరచు కొన్నిమార్గముల సూచించి, అందు రెండింటిని గూర్చి వ్రాయుడు. (8)

శ్రీ కె. సిద్ధలింగపిళ్ళ,
టీచరు - పురపాలక ప్రాథమికోన్నత పాఠశాల తిరుపతి.

మాదిరి ప్రశ్నపత్రము

8 వ తరగతి] సైన్సు [2 గంటలు

I ఈ క్రింది మొక్కలు ఆహారమును ఏభాగమున నిలువచేసికొనును ? ఏల ?
 (1) చెఱకు (2) అల్లము (3) ముల్లంగి (4) కంద

II కిరణజన్య సంయోగక్రియ అనగానేమి ? అది వృక్షములందెప్పుడు జరుగును ?

III నీవు పరిశీలించిన పుష్పమొకదాని పటముగీచి భాగములను దెల్పుము ?

IV ఈ క్రింది పక్షుల ఆహారముదెల్పి, వానిదేహ నిర్మాణము ఆహార సంపాదన కెట్లు తగియున్నదో వ్రాయుము.
 (1) చిలుక (2) కొంగ (3) బాతు

V గ్రుడ్డు పటముగీచి భాగముల పేర్కొనుము ?

VI బహిష్కరణా వయవములేవి ? వానిద్వారా బహిష్కరింపబడు మలినపదార్థములేవి ?

VII రక్తముచేయు పనులేవి ?

VIII సూక్ష్మజీవు లెన్నివిధములు ? అవిఏవి ? ఎట్టిపరిస్థితులందు ఇవి వృద్ధినొందును ?

IX బొగ్గుపులుసు వాయువుయొక్క గుణములేవి? దాని ఉపయోగముల మూడింటిని పేర్కొనుము?

X ఇంద్రధనుస్సు ఏర్పడుటకు కావలసిన పరిస్థితులేవి ?

XI ఉష్ణము నష్టముగా కుండుటకు థర్మాఫ్లాస్కు నిర్మాణమున గల సదుపాయములేవి ?

XII సబ్బుతయారు చేయుటకు కావలసిన పదార్థములేవి?

XIII కాగితము నెట్లు తయారుచేయుదురు ?

XIV ఈ క్రింది వానిలో ఏవేని నాల్గింటినిగూర్చి రెండేసి వాక్యములు వ్రాయుము.
 (1(రూపవిక్రియ (2) కల్పితశ్వాసము (3) ఫలదీకరణము (4) తెల్లకణములు (5) పత్రరంధ్రములు (6) పత్రనిద్ర (7) జ్వరమాని (8) డైనమో.

తిరుపతి, శ్రీనివాసాచారి, టీచరు.

26—12—52

చరిత్ర ప్రశ్నోత్తరములు

(8 వ తరగతి విద్యార్థులకు)

ఆర్. సుబ్రహ్మణ్యం, టీచరు, గంగలకుర్తి అగ్రహారం.

ప్రశ్న	జవాబు
1. రాజశ్రీ ఎవరు ?	హర్షుని చెల్లెలు.
2. సిపాయీల కలహమెప్పుడు జరిగెను ?	1857
3. మొదటి గవర్నర్ జనరల్ ఎవరు ?	వారన్ హేస్టింగ్సు
4. ఆంగ్లసామ్రాజ్యానికి పునాది వేసినదెవరు ?	క్లైవు
5. సహగమనము రూపుమాపినదెవరు ?	రాజారామమోహనరాయలు
6. చెన్నరాష్ట్ర విద్యాశాఖ మంత్రిఎవరు ?	డాక్టరు మల్లవరపు వెంకట కృష్ణారావుగారు
7. మద్యపాననిషేధము ఎప్పుడు ప్రవేశపెట్టిరి ?	అక్టోబరు 1948
8. గాంధి నిర్యాణము ?	30 జనవరి 1948
9. రిపబ్లిక్ ఎప్పుడు వచ్చెను ?	26 జనవరి 1950
10. ఆంధ్రరాష్ట్ర ఉద్యమములో దీక్షవహించి ఆహుతియైనవారెవరు ?	అమరజీవి పొట్టి శ్రీరాములు
11. సిక్కుమతస్థాపకుడెవరు ?	గురునానక్
12. స్వతంత్ర భారతపు మొదటి–ఆఖరు గవర్నర్ జనరల్ ఎవరు ?	సి. రాజగోపాలాచారి
13. తూర్పుఇండియా వర్తకసంఘం ఎప్పుడు స్థాపించబడెను ?	1600
14. శివాజీపట్టాభిషేకం ?	1674

వివేక ప్రశ్నలు

ఆ. వె. అక్షరములునాల్గు అర్థంబు 'బాణము';
అదియె మఱియు 'అక్షి' – కర్థమగును;
మొదటిరెండువర్ణములు'పార్వతికి'నొప్పు
ఆదివర్ణముడుప–అగును 'బకము'.

శ్రీ ఎ. వి. గోవిందరాజు, హెడ్మాష్టరు–తోపుదుర్తి.

తే. ఒక్కపట్టణ మొప్పునై దక్కరముల ;
మొదటిమూడును 'వత్సరమునకు' పేరు;
చివరిరెండును 'వీధికి' జెల్లు; 'వేణి'
యగుద్వితీయాంతములు; చెప్పుడాపురంబు.

శ్రీ బూరాడ గోపాలం, గడ్డవానిపేట.

పదపూరణము

[విద్యార్థులు మాత్రమే వీనిని పూరింపవలెను. చందాదారులు కానివారు విధిగా రెండు అణాల తపాలాబిళ్లలు పంపవలెను. లేనిచో వారి పేర్లు ప్రకటింపఁబడవు.]

పదము		అర్థము
1. ప – – ము	...	గాలి
2. ప – – ము	...	ప్రయాణము
3. ప – – ము	...	జెండా
4. ప – – ము	...	చదువుట
5. ప – – ము	...	పశువు
6. ప – – ము	...	ప్రాయము
7. ప – – ము	...	సైన్యము
8. ప – – ము	...	మాంసము
9. ప – – ము	...	కఠినము
10. ప – – ము	...	జాగ్రత

కూర్పరి: శ్రీ సి. హెచ్. నారాయణరావు, ఆలంబజారు, కలకత్తా.

డిసెంబరు నెల చిత్ర ప్రశ్నలు

(1952 సం॥ డిసెంబరు సంచికలోఁ బ్రకటింపఁబడిన)

వి వే క ప్ర శ్న లు

అను చిత్రప్రశ్నలకు సమాధానములు

౧. భూతపతి　　　౨. నాగకేసరము

*　　*　　*　　*

రెండుప్రశ్నలకు సరియైన జవాబులు పంపినవారు

చందా నెం.

66 క. చంద్రనాయుడుగారు-టీచరు-కొండవండ్లపల్లె

341 భోగాపురపు సీతారామస్వామిగారు-హెడ్మాష్టరు-కొట్టికి

180 దుంపనారాయణమూర్తి విద్యార్థి-ఆడపాపేట

361 ఎ. వి. గోవిందరాజుగారు-హెడ్మాష్టరు-తోపుదుర్తి

156 దుంపరామమూర్తిగారు-టీచరు చింతపల్లిపేట

ఓలేటి రామనాథశాస్త్రిగారు-టీచరు-పురిటిపెంట

571 భాగూరు సత్యనారాయణ పట్నాయక్ గారు-హెడ్మాష్టరు-అవలంగి

126 సి హెచ్. నారాయణరావుగారు-ఆలంబజారు-కలకత్తా

చి॥ బాదాన అచ్చుతనాయుడు-విద్యార్థి-కొర్లవాడ

695 కలిదిండి సత్యనారాయణరాజుగారు-టీచరు-పెనుమర్తి
230 కేగిడి సత్యనారాయణగారు-మేనేజరు-కోటిపాం
చి॥ దుంపప్రకాశరావు-విద్యార్థి-అడపాపేట

మొదటి ప్రశ్నకు మాత్రమే

381 భారతుల ఆంజనేయశోభనాద్రిగారు-టీచరుశనివారపుపేట
గుండేపూడి హనుమంతరావుగారు-శనివారపుపేట

పదపూరణము-సమాధానములు

1. సదనము
2. సవనము
3. సమీపము
4. సతతము
5. సమయము
6. సలిలము
7. సమీరము
8. సరోజము

సరియైన జవాబులు పంపిన విద్యార్థులు

చందా నెం

528 చి॥ గంబలి శ్రీరాములు-విద్యార్థి-శ్రీ. క్రిష్ణాపురము
చి॥ సి. హనుమంతప్ప-ప్రయివేటు విద్యార్థి-గోనభావి
చి॥ కె. చినమల్లప్ప-ప్రయివేటు విద్యార్థి-గోనభావి
చి॥ ఎ. రామయ్యశెట్టి-5 వ తరగతి బోర్డుస్కూలు-గోనభావి
చి॥ పి. మల్లారెడ్డి 5 వ తరగతి బోర్డుస్కూలు-గోనభావి
చి॥ పి. వెంకటరెడ్డి 3 వ తరగతి బోర్డుస్కూలు-గోనభావి
చి॥ కె. తమ్మారెడ్డి 3 వ తరగతి బోర్డుస్కూలు-గోనభావి
చి॥ పి. నారాయణరెడ్డి 3 వ తరగతి బోర్డుస్కూలు-గోనభావి
చి॥ దుంపప్రకాశరావు-విద్యార్థి-అడపాపేట
చి॥ అరిశెట్టి అప్పలరాజు 8 వ తరగతి బోర్డుస్కూలు-భోగాపురము
చి॥ ద్రోణాదుల రామయ్య 5 వ తరగతి బోర్డుస్కూలు-పుల్లలచెరువు
చి॥ కొలుకులూరి వెంకటేశ్వర్లు 5 వ తరగతి బోర్డుస్కూలు-పుల్లలచెరువు
180 చి॥ దుంపనారాయణమూర్తి-విద్యార్థి-అడపాపేట.


వింతపదములు - పొడుపుకథలు

[బాలబాలికలార ! ఈ క్రిందకొన్ని వింతపదములు - పొడుపుకథలుఉన్నవి. వీటి సమాధానాలు చాలగమ్మత్తుగాఉంటవి. మీరందరు వీటినిచక్కాగానేర్చుకోండి]

పదము	జవాబు
1. కారముగానికారము	ఆకారము
2. జనముగానిజనము	భోజనము
3. హారముగాని హారము	విహారము

4. పతిగాని పతి	తపతి
5. గ్రహముకాని గ్రహము	విగ్రహము
6. రాయిగాని రాయి	పరాయి
7. శకముగాని శకము	మశకము
8. వనముగాని వనము	దవనము
9. కలిగాని కలి	ఆకలి
10. క్షణముగాని క్షణము	భక్షణము
11. రాజుగాని రాజు	తరాజు
12. పుణ్యముగాని పుణ్యము	నైపుణ్యము
తలమీదికాయ	సీకాయ
నేలమీదప్రాకుకాయ	ఎండ్రకాయ
మూడుకన్నులుగలకాయ	టెంకాయ
పైకప్పూచు; లోనకాయు	వేరుశనగ
చిట్టిపిడతలో మూడుకూరలు	తాంబూలము
పిడికెడుపిచ్చికకు మూరెడుతోక	గరిటె

కూర్పరులు : శ్రీ ఆర్. సుబ్రహ్మణ్యం పంతులు, గంగలకుర్తి అగ్రహారం. శ్రీ ఎ. వి. గోవిందరాజు, హెడ్మాష్టరు, తోపుదుర్తి.



* అమరజీవి *

(శ్రీ పొట్టి శ్రీరాములుగారి జీవిత సంగ్రహము)

శ్లో॥ "ఏతాన్యపితు కర్మాణి
సంగం త్యక్త్వా ఫలానిచ
కర్తవ్యా నీతిమే పార్థ!
నిశ్చితం మత ముత్తమమ్."

ఈ గీతా శ్లోకములోని యుత్కృష్ట భావము ననుసరించి కర్మభూమియైన మన పవిత్ర భారతదేశమున-పురాణ యుగము నుండి నేటివఱకు-కర్మసంగమును, కర్మఫలమును, అపేక్షింపక వివిధరంగములలో-అకుంఠిత దీక్షతో-మానవసేవ యొనర్చి, అమరజీవులైన మహాపురుషులు పెక్కుమంది గలరు. అట్టివారిలో తానునమ్మిన న్యాయమును సాధించుటకు, అహింసావ్రత నిష్ఠయే పరమోత్కృష్ట సాధనమను నచంచల విశ్వాసముతో, నిష్ఠురదీక్ష గైకొని స్వరాష్ట్రసిద్ధికై ఆత్మబలిదాన మొనర్చిన అమరజీవి-శ్రీ పొట్టిశ్రీరాములుగారు సర్వజన పూజ్యులు. వీరి పూర్ణాహుతికి గల ప్రధానాశయము - నిరాశా నిస్పృహలతో నిర్వీర్యమగు చున్న ఆంధ్రజాతిని పునరుజ్జీవన మొనర్చుటయే.

పూర్వము మహాతాపసులు లోకకళ్యాణమునుగోరి, కఠోరతపము గావించెడి వారనియు, వారి తపోవహ్నికి సమస్తలోకములు తపించి పోయెడివనియు, అట్టియెడ విశ్వకళ్యాణమూర్తి యగు భగవంతుడు వారికి సాక్షాత్కరించి, వారి తపఃఫలమును అనుగ్రహించెడి వాడనియు, మనము పురాణములలో చదివియుంటిమి, అట్టిది నేడు ప్రత్యక్షమగుట సర్వజన విదితము.

ఆంధ్రరాష్ట్ర సిద్ధికై శ్రీరాములుగారొనర్చిన నిష్ఠుర తపస్సుయొక్క వేడిమి యావదాంధ్రమునే గాక - యావద్భారతమునుగూడ- ఉడికించిన దనుటలో నతిశయోక్తిలేదు. రాష్ట్ర నిర్మాణమునకై యెంతకాలమునుండి ఎవరెంత ఆందోళన చేసినను- స్వామిసీతారాం మున్నగువారు ఉపవాసదీక్షలు సలిపినను- కించిత్తుగూడ చలింపక తాత్సారము చేయుచు వచ్చిన కేంద్రప్రభుత్వము శ్రీరాముని తపోవహ్నికి దద్దరిల్లి - ఉక్కిరిబిక్కిరియై - తట్టుకొనలేక ఆంధ్రరాష్ట్రనిర్మాణమునకు సత్వరచర్యలు గైకొన్నది. దీనినిబట్టి శ్రీరామునితపశ్శక్తి యెంతటిదో మనము తెలిసికొనవచ్చును.

ఈ మహాపురుషుడు నూటికి నూఱుపాళ్ళు ఆంధ్రుడు, మొదటినుండియు నిరాడంబరజీవి, కర్మఫలాపేక్ష లేనివాడు. పదవులకోసము - పేరుప్రతిష్ఠలకోసము - ప్రాకులాడినవాడు కాడు. ప్రపంచమునకు తన పేరు తెలియకుండగనే-ఒరులుతన్ను ప్రశంసింపకుండగనే-స్వార్థరహిత బుద్ధితో మానవ

సేవ చేయవలెననెడి పరమాశయము గల వాడు. పూజ్యబాపూజీవలె ఖద్దరు దోవతి కట్టుకొని, కాళ్ళకుచెప్పులుగాని, తలపైన గొడుగుగాని, లేకుండ ఒకసామాన్యునివలె సంఘసేవచేసెడివాడు. "త్యాగమే ధనము-భోగమే రోగము" అని త్రికరణముల విశ్వసించి, తనజీవయాత్ర గడపినవాడు. ఇట్టి మహనీయుడు తెలుగు తల్లి కడుపున జన్మించుట తెలుగుల యదృష్టము.

ఈ మహనీయుని స్వస్థానము నెల్లూరు మండలములోని జువ్వలదిన్నె గ్రామము. అయితే ఈయన ఆగ్రామములో జన్మింప లేదు. మద్రాసు నగరములో-అణ్ణాపిళ్ళెవీధి లోని 162 నెంబరు గృహములో - 1901 సంవత్సరమున జన్మించెను. ఈయన వైశ్య కులస్థుడు. సోదరుడు శ్రీరంగయ్యగుప్త, యం. బి. బి, యస్., ప్రస్తుతము రాజమహేంద్రవరములో డాక్టరుగా ప్రాక్టీసు చేయుచున్నాడు.

శ్రీరాములుగారు తమబాల్య కౌమారములను చెన్ననగరములోనే గడపిరి. అచ్చటనే 1920 వఱకు ఉండి ఇంటర్మీడియెటు వఱకు ఇంగ్లీషు చదివి, తరువాత 'శానిటరీ,,ఇంజనీరింగు' పరీక్షలో ఉత్తీర్ణులైరి. ఈ పరీక్షలో జయముగాంచిన తరువాత మద్రాసునగరమువదలి, జి. ఐ పి. రైల్వేలో నెలకు రు 250/-వేతనము మీాద 'ఇంజనీరు'గా నాలుగుసంవత్సరాలు పని చేసిరి. 1927లో గాంధిమహాత్ముడు తలపెట్టిన 'అసహాయోద్యమము' తీవ్రరూపము ధరింపగా శ్రీరాములుగారు స్వతస్సిద్ధముగా దేశసేవాకాంక్ష కలవారగుటచేత, ఉద్యోగములో నుండజాలక, రాజీనామా ఇచ్చి, తనకుగల యావదాస్తిని సోదరునకు తల్లిదండ్రులకువదలి, కట్టుగుడ్డలతో సబర్మతి ఆశ్రమమునకు చేరుకొని, దేశసేవా దీక్షనుగైకొనిరి. అప్పటికే వీరికి భార్యావియోగము గలిగెను. అందువలన ఐహిక సంబంధములులేని విరాగియై- దేశసేవయే పరమావధిగా దలంచి-1938 వఱకు సబర్మతి సత్యాగ్రహాశ్రమమున, మహాత్ముని సహచరుడుగా పనిచేసిరి.

ఆ యాశ్రమములోపనిచేసినంతకాలము ఈయన పేరుఇతరులకు తెలియకుండ,చాల గుట్టుగా తనకిచ్చినపనిని చక్కగా నెరవేర్చుచు, మహాత్ముని దృష్టిని ఆకర్షింప గలిగెను. ఈయన కార్యాచరణము మహాత్మునకే విస్మయము గలిగించినది. ఈయన నిష్కామబుద్ధికి - కార్యదీక్షకు - మహాత్ముడుప్పొంగి"శ్రీరాములుగారి వంటినిష్కామ కార్య ధురంధరులు-దేశసేవా తత్పరులు, పదిమందిఉంటే స్వరాజ్యసాధన సుగమము కాగల"దని ప్రశంసించెనట.

ఈ స్వార్థత్యాగి స్వరాజ్య సమరములో మూడుసార్లు జైలుకు వెళ్ళెను. 1938 లో 'వ్యక్తిసత్యాగ్రహము' నందు పాల్గొనెను. తరువాత రాజకోటలో ఒకటిన్నర సంవత్సరము ప్రజాసేవ యొనర్చెను. అటుపిమ్మట గుజరాతురాష్ట్రములోని తరవాడా గ్రామసేవాశ్రమజీవి సంఘములో రెండున్నర సంవత్సరములు పనిచేసెను. కొమరవోలు గాంధి ఆశ్రమములో నాలుగు సంవత్సరములు అకుంఠిత దీక్షతో దేశసేవ యొనర్చెను. 1942 ఆగష్టు ఉద్యమములో పాల్గొని, మఱొకసారి చెఱసాలకు వెళ్ళెను. 1943-44లో నెల్లూరుకు వచ్చి రాట్నప్రచారము సాగించెను.

నెల్లూరులో ఉన్నకాలమున ఆయన

ఇంటింటికిపోయి భిక్షాటనచేసి, జీవయాత్ర గడిపెను. అప్పటిలో ఆయన స్వార్థరహిత సేవను నెల్లూరిప్రజలు అంతగా గుర్తింప లేదు. అచ్చట హరిజన దేవాలయ ప్రవేశమునకై ఆయనకృషిచేయునప్పుడు "హరిజనులకు దేవాలయప్రవేశమివ్వండి" అని వ్రాయబడిన అట్టను మెడలో తగిలించుకొని, వాడవాడలకు వెళ్ళి ప్రచారము చేసెను. ఆప్రచారమునకు సవర్ణులు కొందఱేవగించుకొనిరి. యువకులు కొందఱు అపహసించిరి. హరిజనులుకూడ ఆయన తత్వమును తెలిసికొనలేక, అవహేళన చేసిరి. కాని నిదానముమీద ఆయనకు గల సర్వమతసమత్వమును- సమష్టిభోజన పద్ధతిని- తిలకించి, ఆయన తత్వమును తెలిసికొని, నెల్లూరు పురవాసులందఱు ఆయనను గొప్పగా ఆదరించిరి. హరిజనులకు నెల్లూరులో దేవాలయప్రవేశము గలిగించుటకై శ్రీరంగనాయకుని కోవెలయందు 23 రోజులు నిరశనవ్రత దీక్ష సాగించి, కృతకృత్యుడై మహాత్ముని యాశీర్వాదము పొందగలిగెను.

స్వాతంత్ర్యము సిద్ధించిన తరువాత హరిజనోద్ధరణము చక్కగా కొనసాగుటలేదని 1948లో మఱల 29రోజులు నిరశనవ్రత దీక్ష సాగింపగా మదరాసు ప్రభుత్వము తత్తఱపడి కలెక్టరులందఱికి ప్రతిమాసములో కనీసము చివరిరోజుహరిజనోద్ధరణకు వినియోగించ వలసినదిగా ఉత్తరువులను పంపెను. ఈ విధముగా ఈమహాపురుషుడు దేశసేవకు కడంగినప్పటినుండియు - తాను నమ్మినదానికొఱకు - అకుంఠిత దీక్షతో అహింసా పద్ధతులమీద ప్రయత్నము చేయుచు కృతకృత్యుడగు చుండెడివాడు. మహాత్ముని అడుగుజాడలలో ఈ త్యాగమూర్తినడచినట్లు మఱొకవ్యక్తి నడువలేదనుట సాహసోక్తిగాఁబోదు.

స్వరాజ్యములభించిన తరువాత మహాత్ముడేర్పఱచిన సర్వోదయ సిద్ధాంతల ననుసరించి యీరాష్ట్ర తపస్వియజకీయ రంగమునుండి తప్పుకొని 'నిర్మాణ కార్యక్రమము' నందు పాల్గొనెను. తదాది 'గాంధీ స్మారకనిధి' ఆంధ్రసంచాలకుడుగా పనిచేయుచు, తనఖర్చులక్రింద నెలకు 150 రూపాయలుతీసికొనుటకు అవకాశమున్నను ముప్పది మొదలు ఏబది రూపాయలు మాత్రమే పుచ్చుకొనుచు, నిస్వార్థబుద్ధితో ఆ నిధిని దేశోపయోగ కార్యములకొఱకు వినియోగించెను.

ఈ తీరున గాంధీస్మారక నిధికి ధర్మకర్తగా పనిచేయుచు ఆంధ్రుల దుర్దశను తిలకించి - యొకవత్సరము కాలము దీర్ఘముగా యోచించి - రాష్ట్రసిద్ధిలేనిదే ఆంధ్రులు బాగుపడరని గ్రహించి - తదీయ సిద్ధికై 1952 అక్టోబరు 19 తేదీన, మదరాసులో మహర్షి శ్రీబులుసుసాంబమూర్తి గారి వసతిగృహమున, ప్రాయోపవేశదీక్ష గైకొని, అచంచల బుద్ధితో ఆత్మ విశ్వాసముతో, 58రోజులు కొనసాగించి, 1952 డిశంబరు 15 తేది రాత్రి 11.20 గంటలకు ఈ మహనీయుడు పూర్ణాహుతియయ్యెను.

ఈత్యాగమూర్తి పవిత్రాత్మకు శాంతి చేకూరుగాత!

"త్యాగే నైకే అమృతత్వమానశుః"

అను వేద వాక్యమునుసరించి త్యాగమూర్తియైన ఈ తెలుగుబిడ్డ 'అమరజీవి' యయ్యెను.

ఎట్టివ్రాతయు 'శ్రీరామ' చుట్టబడక

ప్రాయబడకుండు నట్లు, అమరజీవియైన శ్రీ పొట్టి శ్రీరాముని పవిత్ర నామము ముందు పేర్కొనబడకుండ ఆంధ్ర రాష్ట్రమునే పనియు నిర్వహింపబడదనుట నిర్వివాదము.

ఈమహనీయుని గురించి పలువురు పెద్దలు ముచ్చటించిన ప్రశంసా వాక్యముల నిందు ఉదహరించుచున్నాము.

1. ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరు ప్రకాశము పంతులుగారు ఇలాఅన్నారు.

"సత్యాహింసలకోసము ప్రాణంఅర్పించేవాడు ఒక పొట్టి శ్రీరాములు ఉన్నాడని నాకు తెలియనే తెలియదు. ఉపవాసం జరుగుతున్నప్పుడుగూడా ఇతనుఇంతవాడని నేను తెలుసుకోలేకపోయాను. ఉపవాసాలలో నమ్మకంలేని నావంటివానికి గూడా శ్రీరాములునమ్మకం కలిగించాడు."

2. భారతప్రధాని శ్రీ నెహ్రూ ఇలా అన్నారు.

"తనకు ముఖ్యమని తోచిన ఏ ఆశయము సాధనకైనా వ్యక్తిగతంగా బాధలను అనుభవించటానికి ఒకరుపూనుకోవడమంటేనే గౌరవించవలసిన విషయం. ఆ ఆశయసాధనకై పూర్ణాహుతియైన అవ్యక్తిని గౌరవించవలసిందే.

3. ఉపరాష్ట్రపతి శ్రీ రాధాకృష్ణపండితులుఇలాఅన్నారు.

తానునమ్మిన ఒకఆదర్శసాధనకోసం ప్రాణాలను బలిపెట్టగల ఒకమహావ్యక్తి ఉన్నాడన్నవిషయాన్ని గుర్తించిగౌరవించకతప్పదు:

4. శ్రీ స్వామిసీతారాం ఇలాఅన్నారు.


నైతిక, ఆధ్యాత్మిక శక్తుల అభ్యాసన్ని తిని ఆశించేప్రతిబిందు కి శ్రీరాములుజీవితం పవిత్రమైనఉదాహరణ.

5. శ్రీ బులుసు సాంబమూర్తిగారు ఇలా అన్నారు,

చంపిరాజ్యస్థాపన చెయ్యవచ్చు - ఇది బలప్రయోగం.

చచ్చిరాజ్యంస్థాపించవచ్చు - ఇది ఆత్మశక్తి ప్రయోగం. ఇందులో రెండోదోనిగొప్పది. పొట్టి శ్రీరాములు ఆత్మశక్తి ప్రయోగించి, ఆంధ్రులను - ఆంధ్రరాష్ట్రాన్ని కదిలించాడు

— సంపాదకుడు



నల్లూరు :

తూర్పుగోదావరిజిల్లా, రామచంద్రపురము తాలూకా నల్లూరు కేంద్రోపాధ్యాయ ద్వితీయవార్షికోత్సవము నల్లూరునందు, ది 20-12-1952 తేదీన ఆలమూరురేంజీడిప్యూటీఇనస్పెక్టరు శ్రీ. బి. వి నరసింహారావు బి. ఎ. బియి. డి. గారి అధ్యక్షతను జరిగినది. ఉపాధ్యాయులకు వ్యాసరచనము నందు, ఉపన్యాసమునందు పోటీలుజరిపి యోగ్యతాపత్రము లొసంగబడెను. పిల్లల కార్యక్రమములు జరిగినపిదప అమూల్యములగు సలహాలు సభనలంకరించిన శ్రీ ఇనస్పెక్టరుగారి చేతను, ఐ. వాసుదేవమూర్తిగారిచేతను. నొసంగబడెను. అల్పాహారవిందయిన పిదప ఫెడరేషన్ ఎన్నికలలో జిల్లామెంబరుగా శ్రీ. యం. బి. యస్. వి. వి. యస్. యస్. నారాయణమూర్తిగారిని, తాలూకామెంబర్లగా శ్రీ. బి. వి. కృష్ణారావు, క. శ్రీనివాసరావు, ఎ. శ్రీరామచంద్రమూర్తిగార్లను, ఎన్నుకొనిరి. మంగళగీతములతో సభముగిసెను.

ఇట్లు

ముకాం-నల్లూరు, బి. వి. కృష్ణారావు,
తేదీ: 22—12—52 శెక్రటరీ

కొప్పాక :

ఏలూరుతాలూకా, వెస్టురేంజి సెంటరు తృతీయ వార్షికోత్సవము ది 20-12-52 తేదీన, ఏలూరు వెస్టురేంజి స్కూళ్ళ డిప్యూటీ ఇన్‌స్పెక్టరుగారగు శ్రీ కె. రామకోటేశ్వరరావుగారి అధ్యక్షతను జరుపబడెను.

పలువురుగ్రామస్థులున్నూ, సెంటరులోని ఉపాధ్యాయ, ఉపాధ్యాయినులున్నూ, ఈస్కూళ్ళలోని బాలిబాలకలున్నూ, ఈ వార్షికోత్సవమునందు పాల్గొనిరి. కార్యక్రమప్రకారం ప్రార్థన సెంటర్ సెక్రటరీగారిచే సెంటర్ నివేదిక చదువబడెను. ఈ సెంటర్‌స్కూళ్ళలోని బాల బాలికలచే వినోదములు వివిధనాటకములు, గొబ్బి డ్యాన్సు మొదలగునవి ప్రదర్శింపబడెను, ఉపాధ్యాయులు. పలువురు పలురకముల చేతిపనులు ప్రదర్శించిరి. ఈవార్షికోత్సవమునందలి ప్రదర్శనములలో పాల్గొనిన వుపాధ్యాయులకును బాలబాలికలకును, పలురకముల బహుమతులుపంచిపెట్టబడినవి, కొప్పాక బోర్డు బాలబాలికలచే ప్రదర్శింపబడిన "బూరెలమూకుడు" అను హాస్యనాటికలో నాయకి, పాత్రధరించిన శ్రీ యస్. సుబ్బలక్ష్మి అనుబాలికకు కొప్పాక బోర్డుహైస్కూలువుపాధ్యాయులు చి॥ టి. సత్యనారాయణగారు. ప్రత్యేక బహుమతి నొసంగిరి. అధ్యక్షులగు శ్రీ డెప్యూటీ ఇన్‌స్పెక్టరుగారు. వార్షికోత్సవములు ఒక సెంటరు అభ్యుదయానికేగాక, బాల, బాలికలు పురోభివృద్ధికి, మిక్కిలి తోడ్పడు ననియు, గ్రామస్థులు తమ పిల్లల జ్ఞానాభివృద్ధి ఎంతవరకు పెంపొందినది గ్రహించుటకు అవకాశములు కలుగుననియు గ్రామస్థుల కిందెంతవరకు బాధ్యతగలదో మొదలగు విషయములను వివరించిరి: చివరకు అల్పాహారవిందులతో సభ ముగించబడెను.

ఇట్లు,

26—12—52, }
కొప్పాక. } యం. క్రిష్ణమూర్తి,
శెక్రటరి.

ప్రభుత్వ నవీనవిద్యా శిక్షణాలయం
మైనంపాడు

పై శిక్షణాలయమున గత సంవత్సరము మూడు నెలలుగా (51-52) శిక్షణపొందుచు దీర్ఘవ్యాధిచే మద్రాసు వైద్యశాలయందు అకాలమరణముపొందిన శ్రీమత్తి(శ్రీకృష్ణమూర్తి సానుభూతిగ యీనెల 6వ తేదీ పాఠశాల మూయబడినది. 5వ తేదీ సాయంత్రం 6 గం॥లకు ప్రధానోపాధ్యాయులు శ్రీ పి. వెంకయ్య బి. ఏ, బిఇ. డి., గారి అధ్యక్షతను సానుభూతిసభ జరుపబడి కృష్ణమూర్తి ఆత్మశాంతికై ప్రార్థనలు జరుపబడినవి. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, కృష్ణమూర్తి సంగీతకళాశక్తిని, వినయ విధేయతలనుగూర్చి. ఉగ్గడించిరి. ఆయనకుటుంబమునకు పైవిషయమును, సానుభూతి తెలుపబడెను.

శ్రీకృష్ణమూర్తి రేపల్లెతాలూకా కొమత్తివారిపాలెం నివాసి.

మైనంపాడు, లంకా వేంకటేశ్వర్లు,
ది 8—12—52 సారస్వతమంత్రి.

ANDHRA RASTRA PRARAMBHA VIDYA
Regd. M.N. 3766 Vol. 41 - No. 10



1953 జనవరి 15 మొదలు 1954 ఫిబ్రవరి 14 వరకు

మేషం—కార్యలాభం-గౌరవం-ధనధాన్యలాభం-శుభకార్యములు-గృహనిర్మాణసంకల్పము.

వృషభం—మితిమీరిన వ్యయము-త్రిప్పట-ఆయాసము-అందోళనము, యాదృచ్ఛిక ద్రవ్యప్రాప్తి.

మిథునం—కళ్యాణ శుభసూచకములు-స్త్రీలాభము-దైవతోపాసన-ధనలాభము-సద్గ్రంథపఠన - గౌరవము-కార్యలాభము.

కర్కాటకం—కార్యవిలంబం-అగ్నిభయం-చోరభీతి-ప్రయాణం-ద్రవ్యనష్టము.

సింహం—ధనలాభము-వివిధాలోచనాపరంపర-చలనా చలితహృదయం-బుద్ధిజాడ్యం-ప్రకోపము.

కన్య—ద్రవ్యనష్టము-తాపత్రయపీడ, సమాదాయవ్యయములు-అందోళన-ఆతురత-.

తుల—శరీరపీడ-దూరప్రయాణము - ద్రవ్యలాభము - బంధుసమాగమము - బంధుమూలక కష్టము మనోవిచారములు.

వృశ్చికం—అపమృత్యుభయం-సర్పాది "విషజంతు హానిః" పుణ్యసందర్శనం - వేగిరపాటు - వివిధాలోచనలు.

ధనుస్సు—ధనధాన్యలాభములు-మిత్రపుత్ర సమ్మేళనం - రాజమంత్రి దర్శనం.

మకరం—ఉష్ణశరీరము-నిశితబుద్ధి-పరోపకారము-యత్కించిద్ద్రవ్యలాభం.

కుంభం—శత్రుభయం - జ్ఞాతికలహం - దూరప్రయాణములు-కార్యములయందు తుందుడుకు.

మీనం—మేరు కనకలాభం - మితిమీరినభోజనము-శత్రువృద్ధి- ఆధ్యాత్మిక చింతనం - శుభకార్యప్రాప్తి-ధనాగమము.

మీ మీ జాతక కుండలిని అనుసరించి మీగోచారఫలాలు పరిణామము చెందుచుండును.

(ఈ సంవత్సరములో కార్తీకపౌర్ణమి - అశ్వినీ నక్షత్రముతో కలియుటవల్ల అక్కడక్కడ దేశములో ధూమకేతుసందర్శనము - గొప్పవారికి (ప్రభుజన) పీడలు - మరణపరిస్థితులు - నదీప్రవాహములు-నదులు పొంగుట - వ్యవసాయనష్టములు -జననాశము- మొత్తముమీద నవంబరు మొదలు ఈ 1954 మార్చి వరకు ప్రభువులకు, ప్రజలకు విరోధాలేకాక యుద్ధప్రయత్నములుగూడ జరిగి ఎక్కువ అశాంతి యేర్పడు సూచనలు గనబడుచున్నవి.)

Edited by Sri M. Venkata Ratnam Garu, B. A., & Printed and Published by Sri E. Venkaiah Garu at his Pattabhirama Press, Eluru.